# మళ్ళీ స్కూళ్ళు తెరిచారు

సోమరాజు చాలా అదృష్టవంతుడు.

ఎందుకంటే అతనికి మూడేళ్ళు నిండిన కొడుకు ఉన్నాడు. మూడేళ్లు నిండిన కొడుకు ఉండే అదృష్టం అని కాదు. మూడేళ్ళు నిండితే మరి స్కూల్లో చేర్పించాలి కదా?.... ఈ రోజుల్లో పెళ్ళిళ్ళు సేయడం ఈజీ. ఇల్లు కట్టేసుకోవడం ఈజీయే కాని చంటిపిల్లాడికి మంచిస్కూల్లో యల్కేజీలో సీటు దొరకడం చాలా కష్టం కదా!.... అటువంటిది సోమ రాజు కొడుకు చిటుకుకి ఓ మంచి కాన్వెంటులో యల్కేజీలో సీటు దొరి కింది. అదెలా అంటే....

సోమరాజు రోజూ ఉదయం వాకింగ్‌కి వెళతాడు. అతను వాకింగ్‌కి వెళ్ళే సమయంలోనే వాళ్ళ కాలనీలోనే ఉండే రామస్వామి కూడా వాకింగ్‌కి వెళతాడు. ఆ విధంగా వాళ్ళు వాకింగ్‌లో రోజూ కలుస్తూ వాకింగ్ 'స్నేహం' ఏర్పడింది.

ఒకరోజు రామస్వామి వాకింగ్‌కి రాలేదు. ఆ మర్నాడు సోమరాజు రామస్వామిని "నిన్న మీరు వాకింగ్‌కి ఎందుకు రాలేదు?" అని అడిగాడు.

"ఏం చెప్పనూ?.... మెదడు వాచిపోయింది.... అందుకే...." అన్నాడు రామస్వామి దిగులుగా.

సోమరాజు రామస్వామి వంక భయం భయంగా అనుమానంగా చూస్తూ రెండడుగులు వెనక్కి వేశాడు.

"మీ ఇంటి దగ్గర పందులెక్కువగా ఉన్నాయా అడిగాడు సోమ రాజు.

"అబ్బే.... మెదడు వాయడం అంటే మెదడు వాపు వ్యాధి కాదు లెండి...."

"మరి?

"మన కాలనీలో సన్స్ అండ్ ఫాదర్స్ గ్రామర్ స్కూలుందా?. ఆ స్కూలు ప్రిన్సిపాల్ నాకు ఫ్రండన్నమాట. ఆ స్కూలు ప్రిన్సిపా నా ఫ్రండు గాబట్టి ఆ స్కూల్లో ఎవరికి సీటు కావాలన్నా నా దగ్గ వస్తారు. రికమండేషన్ చేసి వారి పిల్లలకి సీటు సంపాదించి పెట్టమని.

సోమరాజు సంతోషంగా రామస్వామి వంక చూశాడు.


"అంటే మీరు చెప్తే సీటిచ్చేస్తారా?"

"ఎందుకివ్వడు.... నాకు ఫ్రండు కదా?.... అందుకే రికమండేష కోసం వచ్చే వాళ్ళతో నా మెదడు వాచిపోయింది."

సోమరాజు రామస్వామి వైపు ఆరాధనగా చూశాడు.

"హిహి...." అన్నాడు.

రామస్వామి సోమరాజు వంక చూసి కళ్ళెగరవేశారు.




"హిహి....హిహి...." అన్నాడు సోమరాజు.

రామస్వామికి ఏదో అనుమానం వచ్చింది. భయంభయంగా చూశా

"ఎందుకు అలా నవ్వుతున్నారు?" అని అడిగాడు.

ఏంలేదు మాఅబ్బాయి చిటుకుకి మూడేళ్ళు నిండాయంటా...."

రామస్వామి అనుమానంగా సోమరాజువంక చూశాడు.

"కొంపతీసి మీ వాడికి కూడా ఆ స్కూల్లో సీటుకావాలా?"

"అవును" అన్నాడు సోమరాజు.

వెంటనే రామస్వామి అక్కడి నుంచి పారిపోవాలని ప్రయత్నించాడు. కానీ సోమరాజు కాళ్ళ మధ్య తన కాలు పెట్టేసరికి రామస్వామి ధనేల్‌మని బోర్లా పడిపోయాడు.

"జీవితంలో ఇలాంటి ఎదురు దెబ్బలు తినక తప్పదు.... అందులోనూ ఒక స్కూలు ప్రిన్సిపాల్ తెలిస్తే అసలు తప్పదు.... ప్లీజ్.... మా అబ్బాయికి యల్కేజీ సీటిప్పించరూ?...." అన్నాడు. సోమరాజు రామస్వామిని లేవనెత్తి ఒంటికి అంటుకున్న దుమ్ము దులుపుతూ-

"హబ్బ...." అంటూ రామస్వామి రెండు చేతుల్తో తలపట్టుకున్నాడు.

ఆ విధంగా సోమరాజు తన కొడుకు చిటుకుకి యల్కేజీలో సీటు సంపాదించాడు.

సీటు సంపాదించడం వరకే సోమరాజు అదృష్టవంతుడు.... మరి ఆ తరువాత జరగబోయే కార్యక్రమం మాటో?!"

రేపే సోమరాజు చిటుకుని స్కూలుకి తీస్కెళ్ళబోతున్నాడు.

చిటుకుకి తెలుసు ఆ రోజు స్కూలుకి తీస్కెళతారని.... అందుకే రోజూ ఉదయాన్నే లేచేవాడు ఆ రోజు ఏడుదాటినా లేవలేదు.

"ఒసేవ్.... చిటుకుగాడు ఇంకా లేవనట్టుంది.... వాడిని కాస్త లేపు స్కూలుకి లైమైపోతుంది" అంటూ అరిచాడు సోమరాజు.

"నేను వంటపనిలో ఉన్నాను.... మీరే లేపండి" అంది భార్య అనసూయ వంటింట్లోంచి అరుస్తూ.

సోమరాజు మంచం దగ్గరికి వెళ్ళి

"బాబూ చిటుకూ...." అని పిలిచాడు.

చిటుకు పలకలేదు.

"ఒరేయ్ నాన్నా...." అంటూ చేత్తో తట్టాడు.

చిటుకు "ఊ...." అని మూలుగుతూ అటువైపుకి తిరిగాడు.

"బుజ్జి నాన్నా.... లేవరా...." అంటూ తనూ మంచంకి అట
వైపుకి వెళ్ళి ముందుకు వంగి అన్నాడు సోమరాజు.

"ఊ.... హుహు" అంటూ కళ్ళు మూసుక్కునే కుడికాలు ముందు
ఝూడించాడు చిటుకు. ఆ కాలు సరిగ్గా సోమరాజు ముక్కుమీద తగిలింది

ఆ దెబ్బకి సోమరాజు కళ్ళకి పచ్చ చుక్కలు నాలుగు, ఎర్ర
చుక్కలు ఆరు నీలంరంగు చుక్కలు పది కనిపించాయి.

"తప్పు నాన్నా.... అలా తన్నకూడదు.... లేమ్మా లే.... మళ్ళీ
అన్నాడు సోమరాజు.

"ఉహు.... ఉహు...." అంటూ చిటుకు ఈసారి ఇంకా గట్టిగ
కాలు విసిరాడు.

ఈసారేమో సోమరాజుకి పచ్చచుక్కలు పది, ఎర్రచుక్కల
ఇరవై. నీలం రంగు చుక్కలు ఇరవై నాలుగు కనిపించాయి.

సోమరాజుకి ఒళ్ళు మండిపోయింది.

"ఒరేయ్ గాడిదా.... లేస్తావా తన్ననా?" అని అరిచాడు కోపంగా

"వా.... నేను స్కూలుకి వెళ్ళను....వా...." అంటూ మంచం
మీది నుండే, కళ్ళు మూసుక్కునే ఏడుపు లంకించుకున్నాడు చిటుకు.

"స్కూలుకి వెళ్ళక్కర్లేదులే.... లే.... లేచి మొహం కడుక్కొ
స్నానం చెయ్యి...."

"నేను మొహం కడుక్కోను.... స్నానం చెయ్యను.... స్కూలుకి
వెళ్ళను.... వా....వాహ్హా...." అంటూ మళ్ళీ కాలుని గాల్లోకి విసిరాడు
కాని సోమరాజు ఆ కాలుని అతిలాఘవంగా తప్పించుకున్నాడు.

ఈ గోలకి వంటింట్లోంచి అనసూయ వచ్చింది.

"ఏంటండీ గోల.... మీ వల్ల కాదుగానీ.... మీరెళ్ళండి.... వాడి
సంగతి నేను చూస్తాను...." అంటూ మంచంమీది నుండి వాడిని ఎత్తుకుని
బుజ్జగించి ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పి మెల్లగా మొహం కడిగి స్నానం
చేయించి పెరుగన్నం తినిపించి స్కూలు డ్రస్సువేసింది.

"ఊ.... వీడినిక స్కూలుకి తీస్కెళ్ళండి" అంది అనసూయ.

"ఉహు.... ఉహు...." అన్నాడు చిటుకు.

సోమరాజు చిటుకు చేయి పట్టుకుని వీధిలోకి వచ్చాడు.

వాళ్ళింటికి స్కూలు ఒక అయిదు నిముషాల నడక దూరంలో ఉంది.

రెండడుగులు వేసిన తరువాత చిటుకు చేతిలోని పలకని నేలకేసి కొట్టి "ఉహు.... ఉహు...." అన్నాడు.

సోమరాజు చాలా సంతోషించాడు. ఎందుకంటే పలక పగల్లేదు. తను రేకు పలక కొనడం మంచిదే అయ్యింది అనుకున్నాడు సోమరాజు.

సోమరాజు వంగి పలకని అందుకుని చిటుకుని చూసి చాలా ఆనంద పడిపోయి, ముచ్చట పడిపోయాడు. ఎందుకంటే చిటుకు చాలా చక్కగా స్టెప్స్ వేస్తున్నాడు.

"ఈ చిన్నపిల్లలు ఏం చూసినా ఇట్టే పట్టేస్తారు అనుకున్నాడు సోమరాజు. నిన్న సినిమా చూశాడు.... ఆ సినిమాలోని స్టెప్పులు ఇట్టే పట్టేశాడు:...." అని మురిసిపోయాడు.

కానీ పది క్షణాల తరువాత అవి స్టెప్పులు కావనీ.... చిందులు అనీ సోమరాజుకి అర్థం అయింది.

"ఉహు.... ఉహు.... ఊహూహూ...." స్టెప్పుల వేగం పెరిగింది.

"తప్పమ్మా.... అలా చేయకూడదు.... పద...." అంటూ చేయి పట్టుకున్నాడు సోమరాజు.

చిటుకు హఠాత్తుగా నేలమీద కూర్చుండిపోయి కాళ్ళు రెండూ సర సరా నేలకేసి రుద్దుతూ "ఉహు ఉహు" అన్నాడు.

సోమరాజు కంగారు పడిపోతూ "ఒరేయ్ బట్టలు మాసిపోతాయ్. లే...." అంటూ చుట్టూ చూశాడు. ఇబ్బంది ఎవరైనా ఈ భాగోతం చూస్తున్నారేమోనని.

"నేను లేవను.... ఉహు...." అంటూ వంగి తనను లేపడానికి

ప్రయత్నిస్తున్న సోమరాజు జుట్టుపీకి మొహంమీద ఓ చరుపు చరిచాడు. సోమరాజుకి ఒళ్ళు మండిపోయింది. చిటుకు వీపుమీద ఓ దెబ్బ వేద్దామని చెయ్యెత్తి ఎందుకో అనుమానం వచ్చి పక్కకి చూశాడు. ఎదురుగా ఉన్న ఇళ్ళ కిటికీల లోంచి ఈ భాగోతం అంతా ఎవరో ఆడాళ్ళు గమనిస్తున్నారు. సోమరాజు సిగ్గుతో చితికిపోయాడు.

ఎత్తిన చేయి దించి ప్రేమ నటిస్తూ "లేమ్మా.... నీకు చాక్లెట్లు కొంటా.... బిస్కెట్లు కొంటా...." అంటూ నేలమీది నుంచి లేవదీశాడు.

చిటుకు చేయిపట్టుకుని నడుస్తున్నాడు సోమరాజు. చేయి వదులు నేను నడుస్తా...." అన్నాడు చిటుకు.

సంబరపడి చెయ్యి వదలగానే చిటుకు ఇంటివైపు దౌడు తీశాడు.

సోమరాజు వాడిని వెంబడించి పట్టుకుని ఇహ లాభంలేదని వాడిని ఎత్తుకుని స్కూలుకి బయలుదేరాడు. దారిపొడుగునా చిటుకు సోమరాజు మొహంమీద కొట్టడం జుట్టు పీకడం చేస్తూనే ఉన్నాడు.... సోమరాజు దారిపొడుగునా తనని చూసే వాళ్ళవంక చూస్తూ నవ్వు తెప్పించుకుని నవ్వుతున్నాడు.

ఇలా నాలుగురోజులు గడిచాయ్....

సోమరాజుకి చిటుకు సింహ స్వప్నమైపోయాడు. చిటుకు చదివే స్కూల్లోనే సోమరాజు చెల్లెలు కొడుకు కూడా యల్కేజీ చదువుతున్నాడు సోమరాజు చెల్లెలు అతని ఇంటికి రెండు లైన్ల వెనక ఉంటుంది.

"మా అబ్బాయి మాత్రం స్కూలుకి బాగానే వెళతాడు" అంది సోమరాజు చెల్లెలు అతనితో.

"అయితే కొన్ని రోజులపాటు మీ వాడిని మా యింట్లో ఉంచు.... మీవాడు మా వాడికి తోడుగా ఉంటే మా వాడు స్కూలుకి వెళతాడేమో.... అన్నాడు సోమరాజు.

"ఓ.... దానిదేం భాగ్యం?" అంది అతని చెల్లెలు.

ఇప్పుడు సోమరాజు తన కొడుకుని, తన చెల్లెలి కొడుకునీ ఇద్దరూ రోడ్డుమీద పొర్లుతుంటే చెయ్యి పట్టుకుని లాక్కెళ్తూ వీధిలోని అందరివంకా ఇబ్బంది నవ్వులు నవ్వుతూ స్కూలుకి తీసికెళుతున్నాడు.